సాక్షి
జగిత్యాల
ఆదివారం | 20 | ఆగస్టు | 2023



కొండపై శ్రావణ సప్తాహం

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మూడోరోజు శనివారం శ్రావణ సప్తాహం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు.



గాంధీ సినిమా వీక్షణ

జగిత్యాల: దేశభక్తి, జాతీయభావం పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన గాంధీ సినిమాను గత ఐదు రోజుల్లో 23,177 మంది విద్యార్థులు తిలకించారు. ఈనెల 24 వరకు అన్ని థియేటర్లలో ఉచితంగా సినిమా ప్రదర్శిస్తారు.

గరిష్టం/కనిష్టం
26.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ టికెట్ కోసం శ్రీనివాస్‌రెడ్డి దరఖాస్తు



దరఖాస్తు దాఖలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని మెట్‌పల్లి జెడ్పీటీసీ కాటిపెల్లి రాధ భర్త, కాంగ్రెస్ నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి అధిష్టానానికి శనివారం దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కిసాన్ సెల్ నాయకుడు మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు రమేశ్ ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు

కథలాపూర్(వేములవాడ): పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రోడ్ల నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరైనట్లు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూషణరావుపేట – నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వరకు రూ.2 కోట్లు, చింతకుంట నుంచి కథలాపూర్ శివారులోని గుండు పెరమాండ్ల దేవాలయం వరకు రూ.2 కోట్లు, దూలూర్ నుంచి పోసానిపేట వరకు నిర్మించే రోడ్డుకు రూ.3కోట్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల: ఉద్యోగుల సంక్షేమం కోసం టీఎన్జీవో కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోగ శశిధర్, నాగేందర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్లను శనివారం జరిగిన కార్యక్రమంలో వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాహేద్‌బాబు, రవీందర్, హకీం, రవికుమార్, మధుకర్, ప్రమోద్, సంతోష్, మమత, శైలజ, శ్రావణి, ముజాహిద్ ఖాన్, రాజేందర్, అరుణ పాల్గొన్నారు.

బల్దియా ఆఫీసు తరలింపు

రాయికల్(జగిత్యాల): మున్సిపల్ కార్యాలయాన్ని జగిత్యాల రోడ్డులోని పాత సిటీకేబుల్ సమీప అద్దె భవనంలోకి తరలించినట్లు కమిషనర్ సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకూ అద్దె భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల నిరసన



నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

జగిత్యాల: తమ హక్కుల సాధన కోసం రెండో ఏఎన్‌ఎంలు జిల్లా కేంద్రంలో శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సర్కారు తీరుపై నిరసన తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు మధురిమ, పద్మ, శిరీష, మేరి, మీరజ, శైలజ, జమున తదితరులు పాల్గొన్నారు.

డీ-53కాలువకు బుంగ



రంగపేట వద్ద వృథాగా పోతున్న నీళ్లు

సారంగాపూర్(జగిత్యాల): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డి–53 ప్రధాన కాలువకు రంగపేట గ్రామ శివారుల్లో శనివారం బుంగపడింది. దీంతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. రంగపేట గ్రామ శివారుల్లోని 16.558 కి.మీ. వద్ద 810 క్రాస్ రెగ్యులేటర్‌పై ఒకవైపు మట్టి కోతకు గురై పెద్ద బుంగపడింది. దీనితో నీరు వాగులోకి వెళ్తోంది. తాటిపల్లి ప్రధాన కాలువ వద్ద డి–53 కాలువకు పూర్తిగా నీటి విడుదలను నిలిపివేసినట్లు డీఈ చక్రూనాయక్ తెలిపారు. బుంగపడిన సమయంలో డీ–53 ప్రధాన కాలువకు 810 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు చక్రూనాయక్ పేర్కొన్నారు.

ఎవరి కుర్చీ పదిలం..!?

- పాత జిల్లా బీఆర్‌ఎస్‌లో మారనున్న సమీకరణాలు
- వేములవాడ, ధర్మపురి, కోరుట్లలో మార్పు అనివార్యం
- పెద్దపల్లి జిల్లా అభ్యర్థులందరిపైనా నేతల అసంతృప్తి
- కరీంనగర్‌లోనూ కొన్నిచోట్ల రావాల్సిన స్పష్టత
- తుదిజాబితా కోసం పార్టీలో మొదలైన ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ల కేటాయింపు తలనొప్పిగా తయారైంది. సొంత పార్టీలో అసమ్మతి నేతలు వేర్వేరు కుంపట్లు పెట్టి సిట్టింగ్‌లకు సీట్లు ఇస్తే సహకరించేది లేదని, తమలో ఒకరికి ఇస్తే కలిసి పనిచేస్తామని అధిష్టానానికి సంకేతాలు పంపుతున్నారు. రోజుకో నియోజకవర్గంలో అసమ్మతివాదుల సంఖ్య పెరుగుతుండడం.. ఏకంగా పార్టీ కార్యాలయాలు ఓపెన్ చేయడం, శుభ, అశుభ కార్యక్రమాలకు వెళ్తూ ప్రజలతో మమేకమవుతుండడంతో క్షేత్రస్థాయి క్యాడర్ అయోమయానికి గురవుతోంది. పార్టీ అధిష్టానం నుంచి రెండు, మూడు రోజుల్లో మొదటి విడత జాబితా వస్తుందంటూ వస్తున్న సంకేతాలతో ఉన్న సీటు ఉంటదా..? ఊడుతుందా..? అనే సందిగ్ధంలో ప్రస్తుత ఎమ్మెల్యేలు ఉన్నారు. ద్వితీయశ్రేణి నాయకులు మాత్రం టికెట్ తమకే అంటూ ఎవరి స్టైల్‌లో వారు నియోజకవర్గకేంద్రాలు, మండలాల్లో పర్యటిస్తున్నారు. మరోవైపు పార్టీలో జరుగుతున్న తతంగంపై పార్టీ అధిష్టానం ఒకింత దృష్టి సారిస్తూనే అసమ్మతివాదులను బుజ్జగిస్తూ.. వివాదాలు లేకుండా చేసే ప్రయత్నంలో ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీట్ల కేటాయింపు విషయానికి వస్తే వేములవాడ, రామగుండం, మంథని, పెద్దపల్లి, చొప్పదండి తదితర నియోజకవర్గాలలో సొంత పార్టీ నుంచే తీవ్ర అసమ్మతిని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇది సీట్ల కేటాయింపులో పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు.

కరీంనగర్ జిల్లా...

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మార్చాల్సిందేనంటూ ఆ నియోజకవర్గానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు ఇటీవల కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో సమావేశమై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలోనే తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. వారి అసమ్మతిని చల్లార్చేందుకు మంత్రి గంగుల మంతనాలు జరుపుతున్నారు. అక్కడి నుంచే టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య సొంత పార్టీలోనే రోజురోజుకూ పెరుగుతోంది. మాజీ ఆర్డీవో బైరం పద్మయ్య, కరీంనగర్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, కత్తెరపాక కొండయ్య, బండపల్లి యాదగిరి, గంట కళ్యాణి శ్రీనివాస్ పార్టీ అధిష్టానం వద్ద అభ్యర్థనలు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారు.
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతున్నా మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఓరుగంటి ఆనంద్ పార్టీ అధిష్టానం వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.
- హుజూరాబాద్ సీటు కేటాయింపు విషయంలో గతంలోనే జమ్మికుంటలో జరిగిన బహిరంగ సభలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు తదితరులు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి టికెట్ ఖాయమని సంకేతాలు ఇచ్చారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వొడితెల సతీష్‌బాబు సైతం హుజూరాబాద్ నుంచి పోటీ చేసే విషయంలో ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. హుస్నాబాద్ సీటును పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయిస్తే సతీష్‌బాబు హుజూరాబాద్‌కు రావడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. కానీ ఇటీవలే అక్కడి పార్టీ నేతలు పొనగంటి మల్లయ్య, తుమ్మేటి సమ్మిరెడ్డి అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. అక్కడి నుంచే ఇటీవల పోటీ చేసి ఓడిపోయిన పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సతీమణిని సైతం బరిలో దింపే అవకాశాలను అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం.
- కరీంనగర్ ఎమ్మెల్యేగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ మరోసారి టికెట్ దక్కించుకుని నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పార్టీలో అసమ్మతి ఏమీ లేకపోవడంతో టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

జగిత్యాల జిల్లా...

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు టికెట్ కేటాయించే విషయంపై పార్టీలో కొంత అసమ్మతి నెలకొంది. టీఆర్‌ఎస్ సీనియర్ నేతలు ఓరుగంటి రమణారావు, పి.జితేందర్‌రావులు టికెట్ కోసం పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.
- కోరుట్ల ఎమ్మెల్యేగా ఉన్న విద్యాసాగర్‌రావు అభ్యర్థిత్వాన్ని వీలైతే మార్చి అతని కుమారుడు డాక్టర్ సంజయ్‌ని బరిలో దింపే అవకాశాలపై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది.
- ధర్మపురి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ప్రస్తుత ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ అధిష్టానం తాను కోరుకుంటే తప్ప అభ్యర్థిత్వాన్ని మార్చబోదని సమాచారం. పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్ అభ్యర్థిత్వాన్ని పార్టీ పరిశీలిస్తే ధర్మపురిలో ఎమ్మెల్యే అభ్యర్థి మారే అవకాశాలు ఉండనున్నాయి.

సిరిసిల్ల జిల్లా...

- వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని రమేశ్ అభ్యర్థిత్వం ఈసారి మార్పు తప్పదంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. పౌరసత్వ వివాదం తేలకపోవడం.. ప్రజలకు అందుబాటులో ఉండరనే ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి గతంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చల్మెడ లక్ష్మీనరసింహారావుకు టికెట్ కేటాయింపు ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మేరకు పార్టీ అధిష్టానం సూచనతోనే ఎన్నికల కార్యాలయం ఓపెన్ చేసి ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతానికి చెందిన ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ డాక్టర్ గోలి మోహన్ కూడా పార్టీ అధిష్టానం వద్ద తన పేరు పరిశీలించాలని కోరుతున్నట్లు సమాచారం.
- సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టికెట్ ఖాయం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పేరిట జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ మరోసారి విజయఢంకా మోగించేందుకు తనదైన శైలిలో ప్రచారపర్వంలో దూసుకుపోతున్నారు.

పెద్దపల్లి జిల్లాలో...

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు టికెట్ ఇస్తే సహకరించేది లేదని ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు నియోజకవర్గకేంద్రంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అసమ్మతివాదులంతా ఏకమై పోటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, బొగ్గుగని కార్మిక సంఘం నేత మిర్యాల రాజిరెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వేరుకుంపటి తయారు చేసి తమ పనిలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేగా ఉన్న కోరుకంటి చందర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. తాజాగా బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కౌశిక హరిని శుక్రవారం హైదరాబాద్ తీసుకెళ్లి ప్రగతిభవన్‌లో పార్టీ అధిష్టానంతో మాట్లాడించడంతో హరి చేరిక ఖాయమైంది. ఈ పరిణామంతో రామగుండం రాజకీయం రసకందాయంలో పడింది.
- మంథని నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు టికెట్ కేటాయించవద్దని ఇటీవలే ఆ ప్రాంత మాజీ ప్రజాప్రతినిధులు నాగినేని జగన్‌మోహన్‌రావు, మైదం భారతివరప్రసాద్, బందం వసంతరెడ్డి తదితరులు తేల్చిచెప్పడంతో పార్టీ అధిష్టానం మంథనిపై ఫోకస్ పెట్టింది. కాటారం మాజీ జెడ్పీటీసీ చల్ల నారాయణరెడ్డి సైతం టికెట్ రేస్‌లో ఉన్నట్లు వినికిడి. జెడ్పీ చైర్మన్‌గా ఉన్న పుట్ట మధు మాజీ ఎమ్మెల్యే కావడం.. పార్టీలో బలమైన నాయకుడు కావడంతో టికెట్ ఆయనకే దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మరోసారి టికెట్ కేటాయింపు వద్దని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య నిరసన వ్యక్తం చేసి ఏకంగా పార్టీకి గుడ్‌బై చెప్పారు. వారంతా ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. నల్ల మనోహర్ రెడ్డి, బొద్దుల లక్ష్మణ్ సైతం పార్టీ అధిష్టానం వద్ద తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు వినికిడి. నియోజకవర్గవ్యాప్తంగా ఎమ్మెల్యే తీరుపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా.. టికెట్ కేటాయింపు వ్యవహారం ఎటు దారి తీస్తుందో వేచిచూడాల్సిందే.

కొండగట్టు అంజన్న సన్నిధిలో విచారణ



విచారణ జరుపుతున్న ఏడీసీ కృష్ణవేణి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని ఈనెల 9న లెక్కించిన విషయం విదితమే. ఈ సమయంలో చైర్మన్ తిరుకోవెలూర్ మారుతీస్వామి బంగారు లేదా వెండి ఆభరణాలు తీశారని ఆరోపిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఆలయ బోర్డు సభ్యుడు జున్న సురేందర్, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమేరకు దేవాదాయ శాఖ ఏడీసీ కృష్ణవేణి శనివారం కొండగట్టుకు చేరుకున్నారు. హుండీ ఆదాయం లెక్కించిన పరిసరాలు పరిశీలించారు. పోలీస్ ఔట్‌పోస్టుకు వెళ్లి సీసీ పుటేజీలు తనిఖీ చేశారు. వాటిని పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసుకున్నారు. ఈసందర్భంగా తిరుకోవేలూర్ మారుతీస్వామి, ఫిర్యాదుదారు, బోర్డు సభ్యుడు జున్న సురేందర్, బోర్డు సభ్యుడు వోల్లాల లింగాగౌడ్, అర్చకులు పెద్ద జితేంద్రప్రసాద్ స్వామి, చిరంజీవస్వామి, కపీందర్ నుంచి వాంగ్మూలాలు సేకరించి నివేదిక రూపొందించారు. అయితే, దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హుండీ ఆదాయం లెక్కింపు సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై విచారణ జరిపామని, నివేదికను కమిషనర్‌కు అందజేస్తామని కృష్ణవేణి తెలిపారు. కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, కొండగట్టు ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడి కూలుతుందని ఖాళీ చేశారు..



భవనంలోకి తరలివెళ్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల భవనం గోడలు వర్షానికి బీటలు వారాయి. దీంతో భవనం కూలుతుందన్న ఆందోళనతో సుమారు 130 మంది విద్యార్థులను శనివారం మధ్యాహ్నం బడి నుంచి ఖాళీ చేయించారు. సమీపంలోని మరో భవనంలోకి తరలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి భవనం గోడలు దెబ్బతిన్నాయని ఎంఈవో నరేశం తెలిపారు. కొత్త భవనంలో పూర్తి వసతులు కల్పిస్తామని ఆయన అన్నారు.

జనజీవనం అస్తవ్యస్తం



కల్లూరువాగు వంతెనపై చేరిన వరద



మల్లాపూర్‌లో నీటమునిగిన పొలాలు

- తెగిన రహదారులు.. మునిగిన కల్వర్టులు
- స్తంభించిన రాకపోకలు.. పల్లెలతో తెగిన సంబంధాలు
- ఎడతెరిపిలేని భారీవర్షం తెచ్చిన తంటతంటాలు

సారంగాపూర్(జగిత్యాల): జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన జోరువాన.. శనివారం రాత్రివరకూ ఏకధాటిగా కురిసింది. దీంతో చెరువులు, కుంటలు నిండాయి. మత్తళ్లు దూకాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లో లెవల్ వంతెనలు, కల్వర్టులపై వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. కొన్నిచోట్ల మొక్కజొన్న, పత్తి, వరి పంటలు నీట మునిగాయి.

కోనాపూర్ వాగు ఉగ్రరూపం

జగిత్యాల–సారంగాపూర్ మధ్య కోనాపూర్‌వాగు ఉగ్రరూపం దాల్చి రోడ్డు తెగిపోయింది. ప్రస్తుతం వాగుపై వంతెన నిర్మిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా పైపులతో అప్రోచ్ రోడ్డు నిర్మించారు. మొన్నటి వర్షాలకు ఇది తెగిపోయింది. సుమారు 15 రోజుల పాటు జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలు, మంచిర్యాల జిల్లా జన్నారం తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తెరిపి ఇచ్చాక అప్రోచ్ రోడ్డుకు మరమ్మతు చేయడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. అయితే, వర్షాలతో అప్రోచ్‌రోడ్డు మళ్లీ తెగి రాకపోకలు నిలిచిపోయాయి.

జిల్లాకు రెడ్ అలర్ట్

జగిత్యాలక్రైం: భారీ వర్షాల దృష్ట్యా వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ భాస్కర్ కోరారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. వాగులు, చెరువులు ఉప్పొంగే ప్రమాదం ఉందని, పిల్లలు, యువత అటువైపుగా వెళ్లవద్దన్నారు. తక్షణ సాయం కోసం డయల్100 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ స్తంభాల వద్దకు ఎవరూ వెళ్లకూడదని సూచించారు.

ఏ క్షణంలోనైనా ఎస్సారెస్పీ గేట్ల ఎత్తివేత

జగిత్యాలఅగ్రికల్చర్: ఎగువన కురుస్తున్న వర్షాలతో ఎస్సారెస్పీలోకి వరద భారీగా వచ్చి చేరుతోందని, ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తి గోదావరిలోకి నీళ్లు విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం 50,925 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. కాకతీయ మెయిన్ కెనాల్‌కు 3 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ ద్వారా 5 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టం 1091.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1090.30 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా 86.461 టీఎంసీలకు చేరింది. గోదావరిలోకి నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

వాగులోకి మళ్లీ వరద

కోరుట్ల: 15 రోజుల క్రితం పూల్‌వాగు ఉప్పొంగి తీరంలోని గంగంపేటలోని సుమారు 80 ఇళ్లు కొట్టుకుపోయాయి. ప్రాణాలు దక్కించుకునేందుకు జనం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఇళ్లకు చేరుకున్నారు. ప్రస్తుతం వాగులోకి మళ్లీ వరద పోటెత్తుతోంది. ప్రజలు జాగ్రత్త ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ సూచించారు. శనివారం మధ్యాహ్నం కొంత మందిని ఖాళీ చేయాలని సూచించారు.

మెట్‌పల్లిరూరల్ : ఏఎస్ఆర్ తండా సమీపంలోని కల్వర్టు పైనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు ఇతర మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

తెరిపివ్వని వాన

కోరుట్లరూరల్: పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కల్లూరువాగు లో లెవల్ వంతెనపై వరద ప్రవహిస్తుండటంతో రాయికల్ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి. పొలాల్లో వర్షపునీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

వాహనదారులకు ఇబ్బందులు

ధర్మపురి: రాయపట్నం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట వర్షపునీరు నిలిచింది. రాకపోకలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పాలకులు చెబుతున్నా.. చిన్నపాటి వర్షానికే రాకపోకలు నిలిచిపోవడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

నీటమునిగిన కల్వర్టు..

రాయికల్(జగిత్యాల): సింగరావుపేట, మూటపల్లి, కల్వర్టులపై వరద ఉధృతి పెరిగింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయికల్ చెరువు మత్తడి పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనిని చూసేందుకు పట్టణవాసులు తరలివచ్చి ఫొటోలు దిగుతున్నారు.

మోడల్ స్కూల్‌కు హాలిడే

మల్లాపూర్(కోరుట్ల): స్థానిక మోడల్ స్కూల్‌కు శనివారం సెలవు ప్రకటించారు. భారీ వర్షానికి మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు వరద నీట మునిగింది. అధ్యాపకులు, విద్యార్థులు వెళ్లేందుకు వీలు లేకుండాపోయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ అలీమొద్దీన్ ఎప్పటిలాగే శనివారం లోకల్ హాలిడే ప్రకటించారు. 2013లో ఆదర్శ పాఠశాల ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటిదాకా ఏటా వానాకాలంలో ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని అధ్యాపకులు, విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందిస్తేనే తమ సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నారు.

6.54సెం.మీ. వర్షపాతం

వివిధ గ్రామాల్లో శనివారం వరకు 6.54 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భారీవర్షాలతో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మొక్కజొన్న నీటమునిగింది. గోదావరి నది, పెద్దవాగు తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

గంగనాల మాటుకాలువకు గండ్లు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): భారీ వర్షాలకు గంగనాల మాటు కాలువకు రెండుచోట్ల గండ్లుపడ్డాయి. వరదనీరు వృథాగా పోతోంది. మరోచోట తూము నుంచి నీరు లీకవుతోందని రైతులు తెలిపారు. ఇబ్రహీంపట్నం – వర్షకొండ మధ్య రెండు, యామపూర్ – ఫకీర్‌కొండాపూర్ మధ్య ఒక రోడ్డు డ్యామ్ నుంచి వరద పారుతోంది. మరోవైపు.. ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో ఎస్సారెస్పీలోకి భారీగా వరద వచ్చి చేరుతోందని, ఏ సమయంలోనైనా గేట్లు ఎత్తి గోదావరిలోకి నీళ్లు విడుదల చేసే అవకాశం ఉందని, పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ప్రధానంగా కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్దీపూర్, వేములకుర్తి, ఫకీర్‌కొండాపూర్ గ్రామాల ప్రజలు తీరం వైపు వెళ్లవద్దని సూచించారు.



నిండుకుండలా ఎస్సారెస్పీ



కోరుట్ల పూల్‌వాగుకు పోటెత్తిన వరద



ఏఎస్ఆర్ తండా వద్ద కల్వర్టుపై వరద ఉధృతి



కోతకు గురైన మల్లాపూర్ మోడల్ స్కూల్ రోడ్డు



సారంగాపూర్ : కోనాపూర్ రోడ్డుపై వరద..



ఇబ్రహీంపట్నం - వర్షకొండ మధ్య రోడ్డుపై..



మూటపల్లి కల్వర్టుపై వరద ఉధృతి

క్లుప్తంగా

అలేఖ్యకు డాక్టర్ పట్టా


పట్టా అందుకున్న అనంతరం అలేఖ్య

మల్యాల (చొప్పదండి): ముత్యంపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పన్నాటి మల్లేశం–గీత దంపతుల కూతురు అలేఖ్య 2017లో రాష్ట్రస్థాయిలో 28వ ర్యాంకు సాధించారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు పొంది, ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ఇటీవల హైదరాబాద్ జరిగిన కార్యక్రమంలో అలేఖ్య డాక్టర్ పట్టా అందుకున్నారు. అమ్మానాన్న మల్లేశం, గీత వెన్నంటి ఉంటూ డాక్టర్ కావాలని కలలు కన్నారని, వాటిని సాకారం చేశానని అలేఖ్య తెలిపారు. మేనమామలు రమేశ్, చంద్రశేఖర్, ప్రభాకర్, కుటుంబ సభ్యులు ప్రోత్సాహం అందించారని వివరించారు. నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తానని అలేఖ్య తెలిపారు.

లష్కర్‌ను నియమించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న వీడీసీ సభ్యులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వేములకుర్తిలోని గంగనాల ప్రాజెక్టు కాలువకు వెంటనే లష్కర్‌ను నియమించాలని గ్రామాభివృద్ధి కమిటీ అధ్వర్యంలో శనివారం ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు నుంచి మాటుకాలువ ద్వారా వందలాది ఎకరాల ఆయకట్టుకు సాగుకు నీరు అందుతోందని, అయితే, లష్కర్‌లేక కాలువకు గండ్లు పడుతున్నాయని తెలిపారు. లష్కర్ ఉంటే అప్రమత్తయ్యేవారన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అందుగుల నాగేశ్, ఉపాధ్యక్షుడు కుంచల పెద్దరాజం, నాయకుడు పెంట లింబాద్రి, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళితులకు మేలు

ధర్మపురి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద దళిత వర్గాలకు మేలు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దొంతాపూర్ గ్రామంలోని నేతకాని సామాజిక వర్గానికి చెందిన 20 మందికి పైగా యువకులు, కులపెద్దలు శనివారం లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. నేతకాని వర్గానికి చెందిన వారు తాతల నాటి భూముల్లో కమ్యూనిటీహాల్ నిర్మించుకునేందుకు యత్నిస్తే.. భూస్వాములు ధరణి పేరుతో వాటిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. శాఖాపూర్, నర్సింగాపూర్, గాదెపెల్లి గ్రామాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని, మంత్రి స్పందించక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు దినేశ్, సింహరాజు ప్రసాద్, వేముల రాజేశ్, సీపతి సత్యనారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాత పగలే ప్రాణం తీశాయా?

- ఈనెల 16వ తేదీన రజాక్‌పై దాడి
- దాడిచేసింది గుర్తు తెలియని వ్యక్తులు
- చికిత్స పొందుతూ రజాక్ మృతి
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- పోలీసుల తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం


తన ముగ్గురు పిల్లలతో రజాక్(ఫైల్)


ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): 'ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆయన.. సాయంత్రమైనా తిరిగి రాలేదు.. పనుల్లో నిమగ్నమైన భార్య.. ఆటపాటల్లో ఉన్న పిల్లలు.. ఆయన గురించి అంతగా ఆలోచించలేదు.. ఎప్పటిలాగే రాత్రివరకూ ఇంటికొస్తారని అనుకున్నారు.. అంతలోనే ఆయనకు బదులు ఓ చేదు వార్త ఇంటికి చేరింది.. గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్నాడని సమాచారం అందింది.. అంతే.. ఒక్కసారిగా ఆందోళనకు గురైన భార్య.. భర్త కోసం పరుగులు తీసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను చూసి కన్నీరు పెట్టుకుంది.. భర్తను బతికించాలని మొక్కుకున్నా.. దేవుని మనసు కరగలేదు.. శాశ్వతంగా ఈలోకం నుంచి దూరం కావడంతో ఆమెకు, పిల్లలకు అంతులేని దుఃఖమే మిగిలింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్(37)పై ఈనెల 16న గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడిగా సేవలు అందిస్తున్న రజాక్.. నిజామాబాద్‌లో గత బుధవారం జరిగిన బీసీ గర్జన సదస్సుకు వెళ్లడానికి ఉదయం మెట్‌పల్లిలోని కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి పార్టీ నాయకులతో కలిసి నిజామాబాద్ వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చిన ఆయన.. ఓ పని నిమిత్తం రేగుంట వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకొని దాడి చేశారు. ఈ సంఘటనలో బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు తొలుత ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బంధువులతో గొడవలే కారణమా?

- రజాక్‌కు తమ సమీప బంధువులతో ఓ విషయంలో గొడవలు ఉన్నట్లు తెలిసింది.
- ఈ క్రమంలోనే పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగినట్లు సమాచారం.
- ఈ వివాదం ఇంకా సమసిపోలేదు. దీంతో అవతివారు కక్ష పెంచుకొని పక్కా వ్యూహంతో రజాక్‌పై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.
- ఈ వ్యవహారంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన..

రజాక్‌పై దాడి చేసిన దుండగులను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి కరం ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై శనివారం నిరసన తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత స్వగ్రామానికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, పోలీసులకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. అనంతరం పూలు పట్టుకుని నిరసన తెలిపేందుకు ఎమ్మెల్యే నివాసానికి బయలుదేరి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి


ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు.

బాలికను బెదిరించిన కేసులో ఇద్దరి అరెస్ట్

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఓ బాలికను లైంగికంగా వేధించిన కేసులో రశీదాతోపాటు గడ్డం హన్మాండ్లును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. పని ఇప్పిస్తామని బాలికను కొన్నిరోజుల క్రితం ఈ ఇద్దరు వెంకట్రావ్‌పేట శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకు వెళ్లారని, అక్కడ హన్మాండ్లు బాలికను లైంగికంగా వేధించాడని పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రైతుబిడ్డల ఉన్నత విద్యకు ఆర్థికసాయం

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు


కేడీసీసీబీ శాఖను ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

సారంగాపూర్(జగిత్యాల): విదేశాల్లో ఉన్నత చదువులు చదివే రైతు బిడ్డలకు వ్యవసాయ సహకార బ్యాంకు ద్వారా ఆర్థిక సాయం అందిస్తామని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు తెలిపారు. బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో కేడీసీసీబీ 72వ శాఖ, రేచపల్లి, నాగునూర్‌లో సహకార సంఘాల గోదాములను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జెడ్పీచైర్మన్ దావ వసంతతో శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అసైన్డ్ భూములపై కూడా రుణాలు మంజూరు చేసే అంశం తమ పరిశీలనలో ఉందన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఏటా 400 మంది నుంచి 500 మంది విద్యార్థులకు రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు తక్కువ వడ్డీకి విద్యారుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, సహకార సంఘాల ద్వారా నేతన్నలను ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ, సంపద పెంచు.. పేదలకు పంచు నినాదంతో సీఎం కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారన్నారు. కేడీసీసీ ఉమ్మడి జిల్లా బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావు, మేనేజర్ జి.హన్మంతరావు, సింగిల్‌విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు పాల్గొన్నారు.

టెస్కాబ్ చైర్మన్‌కు స్వాగతం

జగిత్యాలజోన్: జిల్లా పర్యటనకు వచ్చిన టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు జిల్లా కేంద్రంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ రమణ ఘనస్వాగతం పలికారు.

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం

జగిత్యాలఅగ్రికల్చర్: సహకార సంఘాలను బలోపేతం చేస్తామని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ సింగిల్‌విండో నిర్మించిన గోదాం, షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, మార్కెట్ చైర్‌పర్సన్ నక్కల రాధ, సీఈవో శంకర్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి జూడో దోహదం

- క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణిస్తారు
- రాష్ట్రస్థాయి జూడోపోటీలను ప్రారంభించిన కలెక్టర్ గోపి
- 280మంది క్రీడాకారులు, 30మంది రెఫరీలు హాజరు


జూడో క్రీడాకారులతో కలెక్టర్ గోపి, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుతకాలంలో విద్యార్థుల ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ దోహదపడుతుందని కలెక్టర్ బి.గోపి అన్నారు. కరీంనగర్‌లోని మానేరు ఉన్నత పాఠశాలలో జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీలను శనివారం రాత్రి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలకు ఆదరణ పెరుగుతోందని అన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. కొన్నేళ్లుగా రాష్ట్ర, జాతీయస్థాయి జూడో పోటీలను నిర్వహిస్తున్న మానేరు విద్యాసంస్థలను అభినందించారు. మైత్రి గ్రూప్స్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఫుట్‌బాల్ తరువాత అత్యంత ప్రజాదరణ ఉన్న క్రీడ జూడో అన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. మానేరు విద్యాసంస్థల అధినేత, జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలకు తెలంగాణవ్యాప్తంగా సుమారు 280మంది క్రీడాకారులు, 30మంది కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. బంగారు పతకం సాధించినవారిని ఈనెల 28నుంచి సెప్టెంబర్ 1వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ గోపి పోటీలను ప్రారంభించారు. డీవైఎస్ఓ కీర్తి రాజవీరు, భారత జూడో సమాఖ్య కోశాధికారి బి.కైలాస్‌యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్ క్రీడా సంఘాల అధ్యక్షులు నిరంజనాచారి, మధుసూదన్ రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యత గుర్తించాలి



5కే రన్‌లో అతిథులు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: ఓటుహక్కు ప్రాధాన్యతను గుర్తించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు శనివారం 'ఓట్ ఫర్ ష్యూర్' చేపట్టారు. స్థానిక వివేకానంద మినీస్టేడియంలో ఈ సందర్భంగా 5కే రన్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఓటుహక్కు అత్యంత శక్తివంతమైనదన్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, పట్టణ సీఐ నటేశ్, మున్సిపల్ డీఈ రాజేశ్వర్, పీఈటీ పడాల విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

ధర్మపురి: ఏళ్ల వయసు నిండిన ప్రతీఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత సూచించారు. నియోజకవర్గ కేంద్రంలో శనివారం ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు 5కే రన్ నిర్వహించారు. లత మాట్లాడుతూ, అర్హులందరూ ఓటరుగా పేరు నమోదు చేసుకుని, వచ్చే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


కోరుట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు ప్రజలు

ఓటే ప్రధాన ఆయుధం

కోరుట్ల: ప్రజాస్వామ్యంలో ఓటే ప్రధాన ఆయుధమని కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. ఓటరు నమోదు, ఓటింగ్ భాగస్వామ్యం, నేను కచ్చితంగా ఓటేస్తా కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో 5కే రన్ నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రతీఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ కిషన్, సీఐ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, ఎస్ఐ కిరణ్ కుమార్, రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు అధ్యాపకులు, యువకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

71 వైన్స్.. 2636 దరఖాస్తులు

- సర్కారు ఖజానాకు రూ.52.72 కోట్ల ఆదాయం


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో 71 మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రి వరకు 2,636 దరఖాస్తులు అందాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల డిపాజిట్ రూపంలో ప్రభుత్వానికి రూ.52.72 కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో 1,463 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈసారి 2,636 దరఖాస్తులు రావడంతో అదనంగా రూ.23.03 కోట్లు సమకూరాయి. అత్యధికంగా జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ షాపు నంబరు 26 మద్యం దుకాణానికి 80 దరఖాస్తులు రాగా, అతి తక్కువ సారంగాపూర్‌లోని 43 నంబరు వైన్స్‌కు 12 దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ శాఖ ఊహించని రీతిలో దరఖాస్తులు అందాయి.

సర్కిళ్ల వారీగా..

జగిత్యాల సర్కిల్ పరిధిలో 32 షాపులకు 1171, ధర్మపురి సర్కిల్ పరిధిలో 14 షాపులకు 697, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో 25 షాపులకు 768 దరఖాస్తులు వచ్చాయి. కాగా, ఈనెల 21న జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో మద్యం దుకాణాల టెండర్లు డ్రా పద్ధతిన ఎంపిక చేస్తామని ఎక్సైజ్ సూపరింటిండెంట్ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ యాస్మిన్ బాషా సమక్షంలో డ్రా తీసి నిర్వాహకులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు పాస్‌లు జారీచేశామని అన్నారు.

బకాయిలు విడుదల చేయాలి



జగిత్యాల: విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచామని ప్రకటనలు ఇస్తున్నా.. ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. మంచిభోజనం అందించేందుకు టెండర్లు కూడా వేయలేదని పేర్కొన్నారు. పక్కా భవనాలు నిర్మించాలని, కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమీర్, అక్రమ్, సంజయ్, రమేశ్, పవన్, వంశీ, షారూక్, శివసాయిరెడ్డి, అఖిల్, రాహుల్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో కర్ణాటక ఎమ్మెల్సీ పర్యటన


జీబీ పాటిల్‌తో మదన్‌మోహన్

రాయికల్(జగిత్యాల): ప్రవాసి యోజనలో భాగంగా జగిత్యాల నియోజకవర్గానికి కర్ణాటక ఎమ్మెల్సీ, బీజేపీ నేత జీబీ పాటిల్ శనివారం చేరుకున్నారు. ఆయన ఎనిమిది రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నియోజకవర్గంలో అభ్యర్థుల బలబలాలు, వారి స్థితిగతులపై వివరాలు సేకరించి అధిష్టానానికి నివేదించనున్నట్లు తెలిసింది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్యాధికారి శ్రీధర్ శనివారం తనిఖీలు చేశారు. అర్హత లేనివైద్యులతో ఆస్పత్రులు నిర్వహించడమేకాకుండా.. నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు అందిస్తూ పేషెంట్లను మోసం చేస్తున్నారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సభ్యులు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక ఐఎంఏ అధ్యక్షుడు గంగాసాగర్, ఇతర సభ్యులతో కలిసి పలు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. రెండుచోట్ల పరికరాలను సీజ్ చేశారు. నాలుగు ఆస్పత్రులకు నోటీసులు జారీచేశారు. ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ కలిగి ఉండడంతోపాటు అర్హత ఉన్న వైద్యులతో చికిత్స అందించాలని, ఇతర నిబంధనలను కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

సైబర్ మోసం.. రూ.7.67 లక్షలు మాయం

- టెలిగ్రామ్ లింక్ పేరుతో ఆన్‌లైన్ మోసం
- అత్యాశకు పోవద్దు : ఎస్సై మహేందర్

బోయినపల్లి(చొప్పదండి): అత్యాశకు పోయి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లికి చెందిన యువకుడు రూ.7.67లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు.. స్తంభంపల్లికి చెందిన అక్కెనపెల్లి హరీశ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ మెడికల్ బయోటెక్నాలజీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో వచ్చిన మెస్సేజ్‌తో టెలిగ్రామ్ లింక్ ఓపెన్ చేశాడు. మొదట యూట్యూబ్ ద్వారా కొన్ని వీడియోలు పంపితే నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పడంతో అలా చేశాడు. కొద్ది రోజులకు యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతాయని నమ్మబలకడంతో ఈనెల 9, 10, 11 తేదీలలో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా వారు చెప్పిన నంబర్లకు రూ.7.67లక్షలు పంపించాడు. చివరికి యాప్ ఫేక్ అని తెలుసుకొని 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, అత్యాశకు పోయి ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించారు.

ఎగ్జిబిషన్‌కు స్థలం కేటాయింపు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయ ధర్మశాలకు సంబంధించిన సర్వేనంబరు 171లోని రెండు ఎకరాలను సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు ఎగ్జిబిషన్ నిర్వహణ నిమిత్తం బహిరంగ వేలం వేశామని ఈవో వేణుగోపాల్ శనివారం తెలిపారు. జగిత్యాల దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్ పర్యవేక్షణలో వేలం నిర్వహించామన్నారు. కమటం మల్లికార్జున్ వండర్ వరల్డ్ ఫేమ్ ఎగ్జిబిషన్, కరీంనగర్ రూ.13.10 లక్షలకు నిర్వహణ హక్కులు దక్కించుకుందని పేర్కొన్నారు.